నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | డిసెంబర్ 16, 2023 | www.navatelangana.com

సమయ పాలన పాటించాలి

నవతెలంగాణ-పిట్లం


సీమంతం చేస్తున్న సీడీపీవో

అంగన్వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేణుక అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు తమ సెంటర్లను సమయపాలనతో , మెనూ ప్రకారం వంటలతో కూడిన పోషకాహారం చిన్నారులకు , గర్భిణీ , బాలింతలకు అందజేయాలని సూచించారు. చిన్నారులకు పాటలతో కూడిన విద్యను అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనురాధ , ప్రసాద్ , మంజుల, ఆశ వర్కర్ సత్యవతి , గర్భిణీలు , బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు కిక్కిరిస్తున్నాయ్..

- అదనంగా బస్సు నడపండి
- సాలూరలో విద్యార్థుల రాస్తారోకో

నవతెలంగాణ-బోధన్


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఊరికి ఉన్న ఒక్క బస్సు ప్రయాణికులతో కిక్కిరిస్తున్నాయని, విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో అదనంగా సాలూర మండల కేంద్రం వరకు స్పెషల్ బస్సులను నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని అంతరరాష్ట్ర రహదారిపై విద్యార్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు.

వివరాలు మెయిన్‌లో..


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్.. పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా, డీఈవో దుర్గాప్రసాద్

ఆసక్తి కలిగేలా విద్యాబోధన

- నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి
- అధికారులతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ బడులలో మెరుగైన ఫలితాల సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనతో కలిసి శుక్రవారం ఆమె ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. వివిధ జిల్లాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలు, వాటి నిర్వహణ తీరుతెన్నుల గురించి ఆరా తీశారు. అక్షరాస్యత శాతం గణనీయంగా మెరుగుపడేలా బలమైన పునాది వేయడం, ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం పట్ల ఆసక్తిని పెంపొందించేలా నాణ్యమైన విద్యను బోధించడం, విద్యాభివృద్ధిలో ప్రజాప్రతినిధులను, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేయాల్సిన ఆవశ్యకత గురించి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సమీక్షలో నొక్కి చెప్పారు. వెనుకబడిఉన్న అంశాలను ప్రస్తావిస్తూ, వాటి మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన పద్ధతులపై మార్గనిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో, వారు సులభంగా ఆకళింపు చేసుకునే విధంగా పాఠ్యాంశాలను బోధించేలా చూడాలని, బడుల నిర్వహణ తీరుతెన్నులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అప్పుడే విద్యా శాఖ ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. బడులలో అన్నిరకాల మౌలిక సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చూడాలని, ఈ దిశగా ప్రభుత్వం సైతం కృషి చేస్తోందన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్ రూమ్ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జూమ్ మీటింగ్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



- చల్లటిగాలులతో గజగజ
- కామారెడ్డిలో 12.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 12.8గా నమోదు
- పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఎల్లో హెచ్చరిక జారీ
- 'చలి' నేస్తాలకు గిరాకీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్


గంజ్‌లో వెలిసిన స్వెటర్ మార్కెట్

ఉమ్మడి జిల్లాలో చలి చంపుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. దీంతో చలి తీవ్ర ప్రభావం చూపుతుంది. మధ్యాహ్నం సైతం చలిగాలులు వణికిస్తున్నాయి. దీంతో చలి తీవ్రతతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. చలిజ్వరం భారిన పడుతున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు.. తమ పిల్లలను స్కూళ్లకు కూడా పంపడం లేదు. మరో రెండు మూడు రోజుల పాటు చలి తీవ్రత ఇదే విధంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్లు, క్యాప్‌లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. శుక్రవారం కామారెడ్డిలో 12.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 12.8 అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చలి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. రాత్రి వేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో చలి గజగజ వణికిస్తుంది. దీంతో ఉదయం, రాత్రి వేళ.. ఆరుబయట జన సంచారం తగ్గింది. ఎక్కడ చూసి చలి మంటలు కాచుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు ఇదే విధంగా ఉండనున్నట్టు వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా శుక్రవారం కామారెడ్డిలో 12.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 12.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

చలితోపాటు అనారోగ్య సమస్యలు

ఉదయం, రాత్రి వేళల్లో కాకుండా మధ్యాహ్న సమయంలో సైతం చలిగాలులు వీస్తుండటంతో చలిప్రభావం చూపుతుంది. దీంతో అడుగుబయటకు పెట్టేందుకు జంకుతున్నారు. అయితే చలి ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 12 నుంచి 13 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో చలిగాలులకు తలనొప్పి, చలిజ్వరం ఇతరాత్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అస్తమా ఉన్నవారు చలితో తీవ్ర ఇబ్బందులు పపడుతున్నారు. ఇండ్లు లేని అభాగ్యులు, గుడిసెలు, డేరాలు వేసుకొని జీవిస్తున్న పేదల పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

'చలి' నేస్తాలకు పెరిగిన గిరాకీ

చలి ప్రభావం చూపుతుండటంతో చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు స్వెటర్లు, క్యాప్‌లు కొనుగోలు చేస్తుండటంతో వాటికి గిరాకీ పెరిగింది. నగరంలోని గంజ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టిబెటియన్‌ల దుకాణాలు వినియోగదారులకు కలకలలాడుతున్నాయి. చలికాలంలో నాలుగు నెలల పాటు దుకాణాలు నిర్వహించి తర్వాత వెళ్లిపోనున్నారు. ప్రస్తుతం గంజ్‌లో పది దుకాణాలు ఏర్పాటు చేశారు.

రేట్లు పెరిగినా తప్పట్లేదు

గణపతి త్రిశూల్. కొనుగోలుదారుడు.



చలి విపరీతంగా పెడుతుండటంతో స్వెటర్‌లు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గతేడాది కంటే ధరలు పెరిగాయి. బయట చూస్తే చలి ఎక్కువగా ఉంది. తప్పని పరిస్థితుల్లో కొనవలసి వస్తుంది.

40 ఏండ్లుగా విక్రయిస్తున్నాం

టిబెటియన్



నిజామాబాద్ నగరంలో 40 ఏండ్లుగా ప్రతి చలికాలంలో స్వెటర్లు విక్రయిస్తున్నాం. గతంలో బస్టాండ్ దగ్గర ఉండేవి. టిబెట్ వాళ్లవి గంజ్‌లో ప్రస్తుతం మొత్తం పది షాపులు ఉన్నాయి. వీటికి యజమానులు వేరే వాళ్లు ఉంటారు. నాలుగు నెలల పాటు వేతనం చెల్లించి, వసతి భోజన సదుపాయం కల్పిస్తారు. మేము దాదాపుగా ఈ సీజన్ లో నాలుగు నెలలు ఇక్కడ ఉంటాము. ప్రస్తుతం చలి తీవ్ర పెరగడంతో గిరాకీ పెరిగింది. ఒక్క షాప్‌లో ప్రతిరోజు పది నుండి పదివేల పదివేల వరకు గిరాకీ అవుతుంది. అప్పుడప్పుడు తక్కువ అవుతుంది.

శ్మశానవాటికలో క్షుద్రపూజలు

- పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు
- వారిని తరలిస్తుండగా..
  ఇక్కడే విచారించాలని అడ్డుకున్న స్థానికులు
- పోలీసులపై దాడి చేయడంతో లాఠీచార్జి
- మూఢనమ్మకాలపై అవగాహన కల్పించని అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్



వివరాలు మెయిన్‌లో..

మహిళకు ఆరోగ్యం బాగు చేసేందుకు శ్మశానంలో క్షుద్రపూజలు చేస్తున్నారని గ్రామస్తులు పలువురుని అర్ధరాత్రి వేళ పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి దుండగులను పట్టుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా.. ఉదయం వరకు వారిని ఇక్కడే ఉంచి విచారణ చేపట్టాలని అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలు కావడంతో లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మానిక్‌బండార్ తండాలో గురువారం అర్థరాత్రి వేళ చోటుచేసుకుంది.

స్థల వివాదంపై వేల్పూర్‌లో విచారణ

- హాజరైన డీపీవో, ఏసీపీ, ఆర్డీఓ
- నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని వెల్లడి

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)


విచారణ చేపడుతున్న అధికారులు

వేల్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వెనుక భాగంలో ఉన్న స్థలం విషయమై గ్రామ అభివృద్ధి కమిటీ, మైనార్టీల మధ్య నెలకొన్న వివాదం విషయమై డిపిఓ జయసుధ, ఆర్డీఓ వినోద్ కుమార్, ఏసిపి జగదీష్ చందర్, సమక్షంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఇరు వర్గాలు తమ తమ వాదనలు వినిపించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని వీడిసి సభ్యులు, మైనార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. మైనార్టీలు మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తా వెనుక గల తమ చెందిన స్థలంలో ప్రహరీ గోడ నిర్మించడానికి సన్నాహాలు చేస్తే గ్రామాభివృద్ధి కమిటీ వారు అడ్డుకున్నారన్నారు. గతంలోనూ తమపై రెండుసార్లు బహిష్కరణ వేటు వేశారన్నారు. స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి స్థలాన్ని రక్షించుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు.

గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ మైనార్టీలకు చెందిన స్థలాన్ని ఎవరు కబ్జా చేయరని స్పష్టం చేశారు. అయితే ఈ స్థలం వద్ద గ్రామంలో జరిగే ఉత్సవాలు, పండుగలను జరుపుకుంటున్నట్లు వివరించారు. ఈ స్థలాన్ని అందరూ వినియోగించు కున్నందున ప్రహరీ గోడ నిర్మించవద్దని సూచించామన్నారు. డివిజన్ స్థాయి అధికారులు ఇరువర్గాల వాదనలు విని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ డిఈ నాందేవ్, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, బాల్కొండ సిఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై లు, తాసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి డబ్బులు చెల్లించాలి

పోస్టాఫీస్ ఎదుట ఉపాధి కూలీలు రాస్తారోకో


పోస్టాఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు శుక్రవారం పోస్టాఫీస్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. 4 నెలల నుండి ఉపాధి కూలీ డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు. ఉపాధి పని చేస్తున్న 101 మంది కూలీలు ఆందోళనకు తరలివచ్చారు. ఒక్కొక్కరికి 14 వేయిల రూపాయలతో పాటు వన సేవకులకు ఇరవై వేయిలు రూపాయలు లెక్కన సుమారు 17 లక్షలు రావాల్సి ఉన్నా.. రావడంలేదని వాపోయారు. ఉపాధిహామీ కూలీలు సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డితో కలసి ఆందోళన నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు పోస్టాఫీస్‌కు వెళ్లి డబ్బులు అడిగితే ఎందుకు చేస్తున్నారని తమపైనే దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నట్టు వాపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీడీఓ లక్ష్మీ అక్కడ చేరుకొని పై అధికారులతో మాట్లాడి డబ్బులు సోమవారం వరకు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు బారిఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్నాం.. ఆదుకోండి

- జీవన భృతి రూ.15 వేలు చెల్లించాలి
- ఆటో డ్రైవర్‌ల డిమాండ్.. పలు చోట్ల నిరసన

నవతెలంగాణ-విలేకరులబృందం


కామారెడ్డిలో నినాదాలు చేస్తు ఆటోడ్రైవర్‌లు

రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలులోకి రావడంతో తాము ఉపాధి కోల్పోయామని, తమను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్‌లు కోరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. ఆటోలతో కలిసి ధర్నాలు, రాస్తారోకో చేపట్టారు.

ఆర్మూర్ : ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్స్ లను ఆదుకోవాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు అన్నారు. ఆర్మూర్లఓ ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. మినీ స్టేడియంలో సమావేశమై ర్యాలీగా పాత బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు తమని ఆదుకోవాలని నినాదాలు చేస్తూ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేపల్లి సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడం వలన లక్షలాది మంది ఆటో డ్రైవర్స్ నిరాశ్రయులయ్యారనీ రెక్కాడితే గాని డొక్కాడని ఆటో డ్రైవర్స్ కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. దిక్కు తోచని స్థితిలో డ్రైవర్లు ఉన్నారని వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ మాట్లాడుతూ నిరుద్యోగులమైన మాకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మమ్మలని పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్‌లను ఆశ్రయించి ఆటోలను తీసుకొని నడుపుతూ ప్రతి నెల కిస్తు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నామని, వచ్చే కొద్దిపాటి అదయంతో తమ కుటుంబాలను పోషించుకుంటు న్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడం వలన తమకు గిరాకీ లేక పిల్లల చదువులకు, ఇల్లు కిరాయి చెల్లించేందుకు చాలా కష్టంగా మారుతుందని తెలిపారు. తక్షణమే మహాలక్ష్మి పథకంలో మార్పులు చేసి మహారాష్ట్ర తరహాలో మహిళలకు 50% రాయితీపై ప్రయాణించే విధంగా తగు చర్యలు తీసుకుని ప్రతి సంవత్సరం కేరళ, ఆంధ్ర ప్రదేశ్, ఢిల్లీ, తమిళ నాడు తరహాలో పేపర్ ఖర్చుల నిమిత్తం సంవత్సరానికి 12 వేల రూపాయలతో పాటు ప్రతి నెల ఆర్థిక సహాయం అందజేసి ఆటో డ్రైవర్‌లను ఆదుకోవాలని కోరారు. ఆర్డీఓ వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, సాగర్, నగేష్, జవిద్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టింది

బాల్కొండ : మండల పరిధిలోని అన్ని గ్రామాల ఆటో యూనియన్ సభ్యులు తమ ఆటోలతో బాల్కొండలోని ప్రభుత్వ పాఠశాల స్కూల్ గ్రౌండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేయడం వల్ల మా ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆటోలను నమ్ముకొని జీవిస్తున్న మా కుటుంబాలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందని అన్నారు.

మా బతుకులు రోడ్డున వేశారు

కామారెడ్డి : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టి మమ్మల్ని మాత్రం రోడ్డున పడేశారని ఆటో డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఆడవాళ్లకు బస్సులో ఉచిత ప్రయాణంను మేము స్వాగతిస్తున్నాము అన్నారు. మేము కూడా మీకు ఓటు వేయడం జరిగిందని మా ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఆటో యూనియన్ వాళ్లకు జీవన బృతి కింద నెలకు 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందున ఆటోలలో ఎవరూ ఎక్కడ లేదని, రోజుకు 200 కూడాసరిగా రావడం లేదని, అవి సైతం డీజిల్‌కు ఖర్చు అవుతున్నట్టు తెలిపారు. తమను ఆదుకోవాలని కోరారు.



ఆర్మూర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన ఆటో డ్రైవర్‌లు


బాల్కొండలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడుతున్న ఆటో డ్రైవర్‌లు

'ఎన్నికల' వసతులున్నాయా..?

సీఎంసీ, ఆర్.కె కళాశాలలను సందర్శించిన కలెక్టర్, సీ.పీ


డిచ్‌పల్లిలోని సీఎంసీ కాలేజీని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ అధికారులు

నవతెలంగాణ-బోధన్, డిచ్‌పల్లి

డిచ్‌పల్లి లోని సీఎంసీ కళాశాల, బోధన్ పట్టణంలోని ఆర్.కె ఇంజనీరింగ్ కాలేజీలను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. సమీప భవిష్యత్తులో జరుగనున్న నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు అనువైన భవనాలను పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టర్ గురువారం బోధన్ లోని ఆర్.కె ఇంజనీరింగ్ కాలేజీని పరిశీలించిన విషయం విదితమే. తాజాగా శుక్రవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డిలతో కలిసి శుక్రవారం మరోమారు ఈ కళాశాలను సందర్శించారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎం లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ల కోసం ఈ కళాశాల భవనంలో నెలకొని ఉన్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, వాటి గురించి సీ.పీ, అదనపు కలెక్టర్లతో చర్చించారు. ఇదివరకు 2014 జమిలి ఎన్నికలు, 2019 పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సీ.ఎం.సీ కళాశాలలోనే నిర్వహించినట్టు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉన్నందున సీ.ఎం.సీ భవన సముదాయంలోని పలు గదులు నిర్వహణపరమైన లోపాలతో కూడుకుని ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటిని శుభ్రం చేయించి కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ లకు ఈ భవనం ఏమేరకు ఉపయోగపడుతుందో అన్ని విధాలుగా పరిశీలన జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ ఉన్నారు.

లక్ష్మీ కాలువకు నీటిని విడుదల చేయాలి

రాష్ట్ర రైతు నాయకులు బుల్లెట్ రాంరెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రాష్ట్ర రైతు నాయకులు బుల్లెట్ రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ఆయకట్టు రైతులు యాసంగి పంటలకు సిద్ధమౌతున్న వేళ వ్యవసాయరంగానికి నీటి పారుదల ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 78 టీఎంసీల నీటి నిల్వ ఉందని, 60 టీఎంసీల నీరును యాసంగి పంటలకు వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల ఆయకట్టుకు, చౌటుపల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల ఆయకట్టుకు సైతం నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒకవైపు అధికారులు ఈ నెల 18 నుంచి ప్రధాన కాలువలైన (కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ) కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తామని చెబుతున్నారని, ప్రాజెక్టు అధికారులు చెబుతున్న తేదీల ప్రకారం నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు. లేకుంటే పెద్దఎత్తున రోడ్లపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులు పరిశీలన

నవతెలంగాణ-బాల్కొండ


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న తుది దశ సుందరీకరణ , కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే రెసిడెన్షియల్, ఆఫీస్‌లను పరిశీలించిన అనంతరం క్యాంపు కార్యాలయం బయట చేపట్టవలసిన పనులపై ఆర్అండ్‌బి అధికారులకు, వర్క్స్ ఏజెన్సీకి పలు ఆదేశాలు ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ఎంపీపీ లావణ్య-లింగాగౌడ్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సాంఘిక బహిష్కరణ పట్ల ఖండన


మాట్లాడుతున్న అహ్మద్ హుస్సేన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ముస్లిం మతస్తులను బహిష్కరించిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమ్మర్ పల్లి ముస్లిం కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం వేల్పూర్ గ్రామ అభివృద్ధి కమిటీ చర్య పట్ల ముస్లిం కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమ్మర్ పల్లి ముస్లిం కమిటీ అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.... వేల్పూర్ గ్రామంలోని ఈద్గా స్థలం విషయమై పహాని రెవెన్యూ రికార్డు, వక్స్ రికార్డులు అన్నీ ఉన్నప్పటికీ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ ముస్లిం మతస్థులపై సాంఘిక బహిష్కరణ విధించడం సరైంది కాదన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం వేల్పూర్ ఘటనపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి ముస్లిం కమిటీ తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి ముస్లిం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వండి

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన



కరపత్రాలు విడుదల చేస్తున్న కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలని, ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీటీంకు తెలపాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల విఘ్నేష్, సుమతి అన్నారు. మండలంలోని అంకాపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్ గురించి విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినిలు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి. నర్సయ్య, రఘుపతి, ఉపాధాయులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో హాస్టల్స్ నిర్మించాలి

టీయూ పిడిఎస్‌యూ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జయంతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో గర్ల్స్‌కి మరొక హాస్టల్ , పిహెచ్‌డీ స్కాలర్ల కు హాస్టల్, సారంగపూర్‌లో బిఎడ్ కళాశాల వద్ద హాస్టళ్ల ను నిర్మించాలని పిడిఎస్‌యూ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి జయంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ లో పిడిఎస్‌యూ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్ లో గర్ల్స్‌కి ఒకే హాస్టల్‌లో దాదాపు 500 మంది విద్యార్థినులు ఉంటున్నారని, గర్ల్స్‌కి ఓకె హాస్టల్ సరిపోవడం లేదని, ఒక్కో రూమ్‌లో 8 నుండి 10 మంది విద్యార్థునులు ఉంటున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో వాటర్, బాత్రూమ్స్ సరిపోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సారంగపూర్‌లో హాస్టల్ వసతి లేనందున బిఎడ్ సీట్ వచ్చినవారు క్యాన్సల్ చేసుకుంటున్నారని, బీఎడ్‌లో అడ్మిషన్స్ ప్రతి సంవత్సరము తగ్గిపోతున్నాయని దానికి కారణం హాస్టల్ లేకపోవడమే నాని పేర్కొన్నారు. సారంగపూర్‌లో, యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్ లో స్కాలర్స్‌కి హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రిన్స్, దేవిక, యూనివర్సిటీ కమిటీ నాయకులు ఆకాష్, అక్షయ్, మోహిత్, హన్మాండ్లు, లహరి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారం రోజుల క్రితం ఆనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలియని ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించాలని 4వ ఠాణా పోలీస్ సిబ్బంది కోరగా శుక్రవారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవి టాకీస్ చౌరస్తా వద్ద గల సార్వజనిక్ స్మశాన వాటికలో అంత్యక్రియలు చేసినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత ఈసి మెంబర్ కాసుల సాయితేజ, చందా జగన్ మోహన్, జయదేవ్, పురుషోత్తం, 4వ ఠాణా పోలీస్ సిబ్బంది నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షత నేరం.. బేధం చూపొద్దు

- జిల్లా శిశు సంక్షేమ అధికారి ఎస్కే రసూల్‌బి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

లింగ వివక్షత లింగ బేధం చూపవద్దని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎస్కే రసూల్‌బి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో భేటీ బచావో భేటీ పడావో ఒకరోజు ఓరియంటేషన్ సెన్సేషనల్ ప్రోగ్రాం, ఫ్రంట్ లైన్ వర్కర్స్ మండల లెవెల్, డిస్టిక్ హబ ఫర్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఉమెన్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐసిడిఎస్ ఆర్మూర్ ప్రాజెక్టు నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో కన్సర్జెన్సీ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం పోషణ అభియాన్ ద్వారా అంగన్వాడి టీచర్లకు ఆశ వర్కర్లకు గ్రామ సంఘం అధ్యక్షులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా శిశు సంక్షేమ అధికారి ఎస్కే రసూల్ బి హాజరై మాట్లాడుతూ.. లింగ వివక్షతము చూపవద్దని ఆడ మగ తేడా ఉండకూడదని వివరించారు. లింగ వ్యవస్థ గర్భం నుంచి మొదలవుతుందన్నారు. ఆడపిల్లల భ్రూణ హత్యలు జరగనివ్వవద్దని తెలిపారు. సింధు నాగరికతలో ఆడవారు ముందంజలో ఉండి పెత్తనం ఉండేదని అన్నారు. ఆది మానవ నాగరికత తర్వాత సింధు నాగరికత వచ్చిందని సింధు నాగరికతలో పెండ్లి లేవు మతాలు లేవు, రాను రాను మతాలు రావడంతో రాజులు పాలించే స్థితికి వచ్చేసరికి, స్త్రీ జాతి అట్టడుగున చేరిపోయిందని పేర్కొన్నారు. స్త్రీ జాతికి అన్యాయం జరగడంతో సంఘసంస్కర్త రాజారాం మోహన్ రాయ్ సతి సహగమనం రూపుమాపేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. తర్వాత భర్త చనిపోయిన మహిళ తిరిగి పెళ్లి చేసుకునే ఉద్యమం ఈశ్వర చంద్ర విద్యాసాగర్ రావు తీసుకువచ్చారని తెలిపారు. హిందూ చట్టం ప్రకారం రాజ్యాంగంలో ఆర్టికల్ 15 మూడులో మహిళ పట్ల వివక్షత చూపరాదని ఉందన్నారు. ఆర్టికల్ 16 రెండులో సమాన ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్టికల్ 39 బీలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉందన్నారు. 1954లో ప్రత్యేక వివాహ చట్టం తీసుకువచ్చారని మహిళకు తనకు ఇష్టం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవచ్చుని తెలిపారు. 1956లో పిల్లలు కానీ స్త్రీలు దత్తత తీసుకునే చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. 1961లో వరకట్న నిషేధ చట్టం తీసుకువచ్చారన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం కూడా తీసుకువచ్చారని తెలిపారు. లింగ నిర్ధారణ పై చట్టాన్ని ఉల్లంఘిస్తే 10వేల రూపాయల జరిమానా మెడికల్ నామినల్‌లో పేరు తొలగించడం జరుగుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తము 148 స్కానింగ్ సెంటర్లు ఉంటే 23 స్కానింగ్ సెంటర్లను రద్దు చేసినట్టు సమాచారం అని తెలిపారు. మలావత్ పూర్ణ గిన్నిస్ రికార్డులు చేరుకుందని, స్త్రీలు పురుషుల కంటే ఏమి తక్కువ కాదన్నారు స్త్రీలు శక్తినిచ్చే ఆహార పదార్థాలు తీసుకోవాలని సివిటమిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కావున గర్భిణీ స్త్రీలకు పిల్లలకు నువ్వుల లడ్డులు పల్లి పట్టీలు ఇవ్వాలని తెలిపారు. ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం అని నినాదంతో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ప్రతి మహిళ మానసిక ఒత్తిడితో పనిచేయరాదని సూచించారు. తల్లులకు ఏవైనా సమస్యలు ఉంటే 181 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. చిన్నపిల్లల సమస్యలకు 109 నెంబర్‌కు కాల్ చేయాలని, సైబర్ క్రైమ్ అయితే 1930 నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే చిరుధాన్యాలు తీసుకోవాలని, రాగి జావా, జొన్న చపాతి, గోధుమ చపాతి తదితర చిరుధాన్యాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఆర్మూర్ ఎసిడిపిఓ జ్యోతి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, లింగ నిపుణురాలు కవిత, సౌమ్య, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు పుష్ప, అంగన్వాడి సూపర్ వైజార్ ఎస్తేరు రాణి, హెల్త్ సూపర్వైజర్లు, ఐకేపీ ఏపిఎం రవీందర్ రెడ్డి, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, మండలంలోని అన్ని గ్రామాల మహిళా గ్రామ సంఘం అధ్యక్షులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి ఎస్‌కే రసూల్ బి

జీవన్‌రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- ఆశన్న గారి రజిత రెడ్డి స్పష్టీకరణ

నవతెలంగాణ-ఆర్మూర్

హైకోర్టు ఆదేశంతో పట్టణంలోని జీవన్ రెడ్డి మాల్‌కు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఆశన్నగారి రజితారెడ్డికి చెందిన జీవన్ రెడ్డి మాల్‌కు నిబంధనలు ఉల్లంఘించారంటూ విద్యుత్ శాఖ అధికారులు కరెంటు సరఫరాను నిలిపివేసిన సంగతి విదితమే. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మాల్ యాజమాన్యం కరెంటు కట్ వెనుక రాజకీయ ప్రమేయం, కక్ష సాధింపు చర్యలు ఉన్నాయని అనుమానించింది. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకపోయినా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జీవన్ రెడ్డి మాల్ కు విద్యుత్ సరఫరా నిలిపివేసి భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడానికి కారణమయ్యారని రజితారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం విద్యుత్ శాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పది నిమిషాల్లోగా జీవన్ రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో హడలిపోయిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టుకుంటూ అయిదు నిమిషాల లోనే జీవన్ రెడ్డి మాల్‌కు కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

ధర్మమే గెలిచింది..

హైకోర్టు తీర్పుతో భారీ ఊరట లభించిన జీవన్ రెడ్డి మాల్ యజమాని ఆశన్నగారి రజితారెడ్డి 'అన్యాయం ఓడింది, ధర్మమే గెలిచింది' అని సంతోషం వ్యక్తం చేశారు. తమకు వ్యతిరేకంగా రాజకీయ కుట్రలు చేస్తున్నవారికి ఇది పెద్ద పరాజయం అని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన వారు ప్రజలకు సేవచేయాలని, అది మరిచి ప్రత్యర్థులపై రాజకీయ వేధింపులకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కక్ష సాధింపు చర్యలకు భయపడేది లేదని, కుట్రదారులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని తెలిపారు. ఇకనైనా కక్ష సాధింపు చర్యలకు స్వస్తి చెప్పి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని రజితారెడ్డి స్పష్టం చేశారు.

విద్యుత్‌శాఖ అధికారులపై పరువునష్టం దావా

ఇదిలావుండగా నిబంధనలన్నీ సక్రమంగానే ఉన్నప్పటికీ రాజకీయ వత్తిళ్లకు లొంగి అక్రమంగా కరెంటు సరఫరా నిలిపివేసి తమ ప్రతిష్టకు భంగం కలిగించారని విద్యుత్ శాఖ అధికారులపై జీవన్ రెడ్డి మాల్ యాజమాన్యం కోర్టులో పరువునష్టం దావా వేసింది. జిల్లా విద్యుత్ శాఖ అధికారితో పాటు అన్ని స్థాయిల అధికారులపై మాల్ యాజమాన్యం పరువునష్టం పిటిషన్ దాఖలు చేసింది. అన్యాయంగా కరెంటు సరఫరా నిలుపుదల చేయడం వల్ల జరిగిన ఆర్థిక నష్టాన్ని భరించలేకపోతున్న జీవన్ రెడ్డి మాల్ యాజమాన్యం నష్టపరిహారం కోరుతూ వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు.

విద్యుత్ అధికారుల వివరణ ..

జీవన్ రెడ్డి మాల్ యాజమన్యం వాళ్లు హైకోర్ట్ లో విద్యుత్ సరఫరా పునరుద్దరణ గురించి లంచ్ మోషన్ పెటిషన్ , కరెంట్ బకాయిలు 2.6 కోట్లు ఉండగా శుక్రవారం వరకు 1.8 కోట్లు చెల్లించారు. మిగితా 80 లక్షలు బకాయిలు మొదటి విడుత 40 లక్షలు ఈ నెలా 21 తేదీ లోగా కడతామని, మిగితా 40 లక్షలు మూడు వారాల్లో కడతామని ప్రమాణ పత్రం సమర్పించడం వల్ల హైకోర్ట్ విద్యుత్ సరఫరా పునరుద్దరణ చేయమని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు జీవన్ రెడ్డి మాల్ కి విద్యుత్ పునరుద్దరణ చేసినట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో ధర్మారం విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ధర్మారం (బి)విద్యార్థినులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నంది మేడారంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల రాష్ట్రస్థాయి పోటీల్లో ధర్మారం (బి) విద్యార్థినిలు విజేతలుగా నిలిచారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ లో సన్నిధి, ఐశ్వర్య, నాగమణి, అభిసీత, ప్రైసి, టెన్నికాయిట్‌లో హంష, మృదుల విజేతలుగా నిలిచారు. వీరిని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరాజ రెడ్డి, పిఈటీ జోష్న, హౌస్ టీచర్స్ అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి ఎంపిక


బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-సిరికొండ

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ ఎస్‌వైఆర్ఆర్ మైదానంలో ఈనెల 16 నుండి 18 వరకు జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బేస్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికైనట్టు తెలిపారు. పాఠశాలకు చెందిన ఎ. రుత్విక్ ఈ నెల 13న ఆర్మూర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని అన్నారు. రుత్విక్‌ను పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని, నైపుణ్యాలను మెరుగుపరుచుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంతటి బాలస్వామికి డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయనశాఖలో అంతటి బాలస్వామికి పిహెచ్.డి. డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. డాక్టర్. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి పర్యవేక్షణలో అంతటి బాలస్వామి "తెలుగులో షష్టిపూర్తి సంచికలు - పరిశీలన" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించి తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. దీనికి సంబంధించిన ఓపెన్ వైవా-వోస్ (మౌఖిక పరీక్ష)ను శుక్రవారం ఆర్ట్స్, సైన్స్ కళాశాలలోని హ్యుమానిటీస్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ లోని తెలుగు శాఖలో ప్రొఫెసర్ డాక్టర్. సాగి కమలాకర శర్మ విచ్చేసి సిద్ధాంత గ్రంథంపై పలు ప్రశ్నలు అడిగి పరిశోధకుడి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సిద్ధాంత గ్రంథం అనుభవజ్ఞులైన వ్యక్తుల జీవిత పాఠాలను వెలుగులోకి తెచ్చి సామాజిక సాంస్కృతిక వ్యక్తిత్వ నిర్మాణానికి బాటలు వేస్తాయని అన్నారు. దీనికి ఆర్ట్స్ డీన్ ఆచార్య వి. త్రివేణి చైర్మన్‌గా వ్యవహరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ కె. లావణ్య, ప్రొఫెసర్ డాక్టర్ పి. కనకయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి తదితర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బట్టాపూర్‌లో సంత ప్రారంభం


మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలో శుక్రవారం అంగడి ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ కట్కం పద్మసాగర్, గ్రామకమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం అంగడి ఉంటుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిల్క భగీరథ కిషన్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు గైర్హాజరైతే ప్రజాసమస్యలు తీరేదెలా?

- ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

అధికారులు గైర్హాజరైతే ప్రజా సమస్యలు తీరేదెలా అని ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ ఉపేంధర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మొదటగా వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ... రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రస్తుతం పాత పద్ధతినే ఎకరానికి 5 వేల రూపాయలు అందుతాయని అన్నారు. మండలానికి చెందిన విద్యుత్ ఏఈ ఒకసారైనా సమావేశానికి హాజరు ఎందుకు అవడం లేదని ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, సోమరాజారెడ్డి ప్రశ్నించారు. అలాగే ప్రతినెల వీధిలైట్ల బిల్లు కడుతున్నా... రశీదులు ఎందుకు ఇవ్వడం లేదని, ఆడిట్‌లో మేము ఏమి చూపెట్టాలని విద్యుత్ అధికారులను ఇరువురు సర్పంచులు అడిగారు. ఉచిత బస్ ప్రయాణం వల్ల బస్సులు సరిపోవడంలేదని బస్‌ల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులను కోరారు. నీటి పారుదలకు చెందిన అధికారి మాట్లాడుతూ.. ఈ నెల 17 నుండి ఏప్రిల్ 1 వరకు పంటలకు నీటి విడుదల ఉంటుందని అన్నారు. వైద్యారోగ్యశాఖ వారిని ఎంపీటీసీ జక్కని మధుసూదన్ ప్రశ్నిస్తూ... అధికారికంగా డెంగ్యూ కేసులు చాలా ఉన్నాయని మీరు మాత్రమే మీ దృష్టికి వచ్చినట్లు చెపుతున్నారని అన్నారు. మండలంలో ప్రభుత్వ వైద్యశాల ఉన్న పాము, కోతి, కుక్కకాట్లకు ప్రజలు కమ్మర్‌పల్లి ప్రభుత్వ వైద్యశాలకు వెళుతున్నారని అన్నారు. ఇక్కడున్న వైద్య పరికరాలు ప్రజల కోసం ఉపయోగించక తుప్పు పట్టిపోతున్నాయని తెలిపారు. అలాగే వైద్యశాల పునర్నిర్మాణ పనుల కోసం 18 లక్షల గ్రాంటు వస్తే కనీసం ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలుపలేదని, అవి ఏ విధంగా ఖర్చు చేశారని జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయిల్ ఫామ్ సాగులో ఏర్గట్ల మండలం జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉందని ఆయిల్ ఫామ్ అధికారి తెలిపారు. విద్యాశాఖ అధికారి ఆంద్రయ్య మాట్లాడుతూ...మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాక మండలంలోని కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయడానికి కార్మికులు ముందుకు రావడం లేదని అన్నారు. అలాగే మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా పాఠశాలలో 10 శాతం పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల కొత్త సంవత్సరం వరకు పాఠశాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. గుమ్మిర్యాల్ సర్పంచ్ సోమరాజారెడ్డి, తడపాకల్ సర్పంచ్ పతిరెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ... ఈజిఎస్‌లో భాగంగా మన ఊరు మన బడిలో కంపౌండ్ వాల్స్‌లను, గదులను స్వంత ఖర్చులు పెట్టి నిర్మించామని, వాటి బిల్లులు ఇప్పటికి రాలేవని, ఏఈ కూడా పని ప్రదేశాలకు వచ్చి కొలతలు తీసుకోలేదని, పెట్టుబడి పెట్టాం మా పరిస్థితి ఏంటని తమ గోడు వెళ్ళబోసుకున్నారు. గృహలక్ష్మీ ప్రొసీడింగ్‌లు కొందరికి వచ్చాయని, వారికి బిల్లులు వస్తాయా..లేదా.. అని సర్పంచ్లు ఎంపీడీఓను అడగగా ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి మార్గనిర్దేశకాలు అందలేదన్నారు. ఎంపీడీఓ రాజేశం మాట్లాడుతూ... ఉపాధిహామీలో భాగంగా నాటిన మొక్కలు కాల్చివేసిన, నరికివేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏపీఎం శ్యామ్ మాట్లాడుతూ... గృహ వినియోగానికి సోలార్ సిస్టంలను సబ్సిడీలతో అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, ఎంపీటీసీ ఆడేం సవిత గంగాప్రసాద్, ఎమ్మార్వో యూసుఫ్, ఎంపిఓ శివ చరణ్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నార



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 16, 2023 | www.navatelangana.com

ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం



నవతెలంగాణ-రాజంపేట్
మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో పెరుగుదల మెలకువలు అవగాహన కల్పించారు. గర్భకోశ వ్యాధి చికిత్స, 15 సాధారణ చికిత్సలు, 25 దూడలకు నట్టల నివారణ చికిత్స అందజేసినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షులు స్వామిగౌడ్, సిబ్బంది నర్సింలు, వైద్యాధికారి రామ్‌చందర్, వైద్యసిబ్బంది రమేష్, హాజీ, సురేష్, లింగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కౌన్సిల్ మెంబర్‌గా బీర్కూరు సుధాకర్



నవతెలంగాణ-రెంజల్
ఫార్మా కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన బీర్కూర్ సుధాకర్‌ను రెంజల్ మండల అసోసియేషన్ తరపున శుక్రవారం నిజామాబాద్ పట్టణంలో ఘనంగా సన్మానించారు. మండలాధ్యక్షులు గుజుల దయాకర్‌రెడ్డి, కార్యదర్శి షేక్ ఏజాస్ హైమద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సమస్యలపై నిలదీత

వాడీవేడీగా చందూర్ మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-వర్ని(చందూర్)
మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ దశగౌడ్‌తో పాటు సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. సమాధానం లేక అధికారులు ప్రభుత్వమే కారణమని మౌనం వహించారు. శుక్రవారం చందూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మపూర్, ఘన్‌పూర్ గ్రామాల సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. మిగతా మూడు గ్రామాల సర్పంచ్‌లు ఇది చివరి సమావేశం అయినా హాజరు కాలేదు. పలు శాఖల అధికారులు హాజరై గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించగా.. ఉపాధిహామీలో భాగంగా ఐహెచ్ఎల్ బిల్లులు సుమారు మండలంలో పలు గ్రామాలలో మంజూరైనవని తెలుపడంతో వైస్ ఎంపీపీ దశగౌడ్ స్పందిస్తూ.. 'సర్పంచ్‌లు బిల్లులు ఎవరికి ఇచ్చారు? ఎప్పుడిచ్చారు? ఇది అబద్ధం. ఇందులో లబ్ధిదారులకు మోసం జరిగింది. బిల్లులపై గ్రామపంచాయతీలో గొడవలు జరిగాయి' అంటూ ఎంపీపీ దృష్టికి తెచ్చారు. మరుగుదొడ్లు నిర్మాణం చేయకున్నా చేసినట్లు బిల్లులు చెల్లించినవి గ్రామాల్లో సుమారు ఐదు నుంచి పది వరకు పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తున్నాయని సర్పంచులు నిలదీశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల అకౌంట్‌లో బిల్లులు వేయమని ఆదేశాలు వచ్చాయని ఉపాధిహామీ అధికారి తెలపడంతో ఎప్పుడు ఆదేశాలు వచ్చాయని నిలదీశారు. ఈ డబ్బులు ఎవరి జేబులోకి పోయినవో తమకు సమాచారం ఇవ్వాలని వైస్ ఎంపీపీ కోరారు. ఉద్యానవన శాఖ నుంచి చిన్న సన్న కారు రైతులు పంట చెలలో గెట్లపై చెట్లు పెంచడానికి, అలాగే పండ్ల తోటలకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, దీనిపై గ్రామాల్లో దండోరా ద్వారా తెలుపాలని చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో ఆరు బయట బడి ఇడు పిల్లలను బడిలో చేర్పించేలా విద్య శాఖ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సర్వే చేపట్టినట్లు ఎంఈవో శాంతాకుమారి అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో ఎలాంటి పొరపాట్లు లేవని చెప్పారు. సర్పంచ్‌లు గ్రామంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, అప్పుడే ఎంబి చేస్తామని, ఇప్పటి వరకు ఎంత పనులు జరిగినవో అన్నింటి బిల్లులు ఎంబీ అయినట్లు పంచాయతీ ఏఈ పవన్ అన్నారు. మండలం ఉన్నా తమకు తహసీల్దార్ కొరత ఉందని ఎప్పటి నుంచి అడిగిన అధికారి మాత్రం విధులలోకి రావటం లేదని దశగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు, ప్రజలకు రెవిన్యూ పరంగా పనులు కాకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించాం. తహసీల్దార్ సెలవులో ఉందని ఇంచార్జి తనకు ఇవ్వలేదని ఒక మూడు రోజులలో తనకు ఇంచార్జి ఇవ్వచ్చు అని తెలిపారు. ఇది సరైంది కాదని ఈ విషయంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీని, ఎంపీడీఓను సర్పంచ్‌లు, వైస్ఎంపీపీ కోరారు. ప్రతి గ్రామంలో బాలింతలకు, గర్భిణులకు అంగన్వాడి సెంటర్లలో పౌష్టికాహారం అందజేస్తున్నామని చిన్న పిల్లలకు కూడా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రభుత్వం అందించే బాలమృతం లాంటి సంక్షేమ ఆహార పథకాలను అందిస్తున్నామని అంగన్వాడీ సూపర్‌వైజర్ మమత తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండడానికి స్థానికంగా గ్రామాలలో రెండవ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి వాడలో పర్యటనలు చేసి ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తమకు చేరవేస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సమస్యలు అక్కడక్కడ ఉన్నప్పటికీ స్థానిక గ్రామ సర్పంచులు వాటిని పరిష్కరించుకుంటూ ప్రజలకు నీరు వచ్చేలా చూస్తున్నామని సర్పంచులు తెలిపారు. జనవరిలో సర్పంచుల పదవీ కాలం ముగియనుండగా.. వారికి ముందస్తుగా ఎంపీడీవో, వైస్ ఎంపీపీ, ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో సన్మాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామని వారు సమావేశం ద్వారా తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు సత్యనారాయణ, దాసరి గంగారాం, వైస్ ఎంపీపీ దశగౌడ్, అధికారులు శాంతకుమారి, పవన్, మమత, ఎంపీవో తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

గరీబోళ్లకు అండగా..



పుస్తె, మట్టెలు అందజేస్తున్న డాక్టర్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ ఉమ్మడి మండలంలో గరీబోళ్లకు డాక్టర్ బండివార్ విజయ్ అండగా నిలుస్తున్నారు. స్వచ్ఛందంగా తనకు తోచిన సహాయం అందజేస్తున్నారు. పశు వైద్య డాక్టర్ బండివార్ విజయ్ అనాథ అమ్మాయి పెళ్లికి శుక్రవారం పుస్తె, మట్టెలు అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తూ డాక్టర్ విజయ్ మద్నూర్ ఉమ్మడి మండలంలో ప్రజల ద్వార మన్ననలు పొందుతున్నారు. మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల పరిధిలోని లక్మాపూర్ గ్రామంలో తల్లిదండ్రులు లేని పేద అమ్మాయి సరడెవార్ అనిత పెండ్లికి పుస్తె మట్టల ద్వారా సహాయ సహకారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దస్తీరాం, జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డా.విక్రమ్ కుమార్, మద్నూర్ మండల చైర్మన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొండల్‌రెడ్డిని కలిసిన ఐకెపి వీవోఏ ఉద్యోగుల సంఘం సభ్యులు



కొండల్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డిని వారి స్వగృహంలో ఐకెపి వీవోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్‌గౌస్ ఖాన్ సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం పఠాన్‌గౌస్ ఖాన్ మాట్లాడుతూ తమ సమస్యల సాధనలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోతో శివరాం నాయక్, మాచారెడ్డి మండల అధ్యక్షులు అంకం కిషోర్ కుమార్, రఫీయుద్దీన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

18న మద్నూర్ మండల సర్వసభ్య సమావేశం

- ఎంపీడీవో రవిశ్వర్‌గౌడ్

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18న సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి రవీశ్వర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల ఎంపిటిసిలు, సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత




పోగొట్టుకున్న మొబైల్ అప్పగిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన అల్తాఫ్ ఇటీవల తన మొబైల్ పోయిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందజేసినట్టు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. దీనికి సహకరించిన ఆపరేటర్ గణేష్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. మొబైల్‌ను పోగొట్టుకున్న బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా వద్ద శుక్రవారం గంగాధర్ (55) అనే వ్యక్తి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్టు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలానికి చెందిన గంగాధర్ బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌కు వచ్చి ఆయన వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది శరీరానికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు గల కారణాలు బాధిత వ్యక్తి నుంచి పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్
కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులకు అవగాహన కల్పించినట్టు ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసి మేక విజయ సంతోష్ పేర్కొన్నారు. నేటి నుంచి రెంజల్ మండలంలోని కిసాన్‌తాండ, కళ్యాపూర్ గ్రామాలలో ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను ప్రజలకు వివరించేలా గ్రామస్థాయి అధికారులు సహకరించాలని వారన్నారు. మొబైల్ వ్యాన్ ప్రతి గ్రామాన్ని సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించడమే కాకుండా గ్రామస్థాయి అధికారులు సైతం వారికి క్షుణ్ణంగా తెలియజేయాలని వారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ వర్తించేలా అధికారులు వారికి అవగాహన కల్పించడం, నూతనంగా దరఖాస్తు చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జడ్పీటిసి మేక విజయ సంతోష్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, గ్రామ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, ఐకెపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ 12వ వార్షికోత్సవం

నవతెలంగాణ-బోధన్
మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో శ్రీ జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయ 12వ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భారీగా పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నీ ప్రయోజనాలను కల్పించాలి

- కొనసాగుతున్న గ్రామీణ డాక్ సేవకుల నిరవధిక సమ్మె



నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

నవతెలంగాణ-బిచ్కుంద
ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, కేంద్ర సంఘాల పిలుపు మేరకు తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామీణ డాక్ సేవకుల నిరవధక సమ్మెలో మండలంలోని గ్రామీణ డాగ్ సేవకులు గత 12వ తేదీ నుంచి సమ్మె కొనసాగిస్తున్నారు. గ్రామీణ డాక్ సేవకులు మాట్లాడుతూ.. గ్రామాలలో డాక్ సేవకులు గత 15 నుంచి 20 సంవత్సరాలు నుంచి సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎనిమిది గంటల పని కల్పించి పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను కల్పించాలని అన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షల వరకు డిపార్ట్‌మెంట్స్ స్టాఫ్‌తో సమానంగా జీడిఎస్ గ్రాట్యూటీ పెంచాలని, సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం ప్రకారం కొత్తగా నియమించిన జీడిఎస్‌లకు ఐదు గంటల పనిని సెకండ్ టిఆర్సి ఏ ఇవ్వాలని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు జీడిఎస్‌లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేవరకూ నిరవధిక సమ్మె కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిపిఎంలు హనుమాన్లు, అశోక్ పటేల్, అనిల్, సునీల్, గంగారాం, శివ, అఫ్రోజ్ ఉన్నారు.

పంటలకు తెగుళ్లు..

- నివారణకు చర్యలు తీసుకోవాలి
- పంటల పరిశీలనలో వ్యవసాయ అధికారులు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మద్నూర్
పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. శుక్రవారం మద్నూర్ మండలంలోని లచ్చన్, పెద్దఎక్లారా, గ్రామ శివారు పరిధిలో మండల వ్యవసాయ అధికారి రాజు, ఆయాగ్రామాల ఏఈఓలు లక్ష్మణ్, సంయుక్త, కలిసి శివారు ప్రాంతంలో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, శనగ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొక్కజొన్నపై కత్తెర పురుగు, మినుము పంటపై లద్దె పురుగు, శనగ పంటకు ఎండు తెగుళ్ల సోకినట్లు పంటల పరిశీలనలో గమనించినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పురుగుల బెడద మూలంగా నష్టపోతున్న పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయా గ్రామాల రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఎలాంటి పిచికారీ మందులు వాడాలో వాటి గురించి తెలియజేసినట్లు మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. పంటల పరిశీలనలో లచ్చన్, పెద్దఎక్లారా గ్రామాల రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వికలాంగులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య



వికలాంగులను సన్మానిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి
వికలాంగులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య అన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు వివిధ క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బావయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక రకమైన విజ్ఞానం దాగి ఉంటుందన్నారు. దివ్యాంగులు స్వయం ఉపాధి రంగాలు ఏర్పాటు చేసుకొని మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. క్రీడా పోటీలలో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేశారు. దివ్యాంగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అర్హత గల వారికి పరికరాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన దివ్యాంగులకు సన్మానం చేశారు. జిల్లా భవిత కేంద్రం సమన్వయకర్త శ్రీపతి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఐకెపి డీపీఎం రమేష్ బాబు, దివ్యాంగుల సంఘాల ప్రతిని ధులు బాల్‌రెడ్డి, దుర్గ ప్రసాద్, పోచవ్వ, హరి సింగ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు మనోహర్‌కు సన్మానం..

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సామాజిక బాధ్యత గల మనోహర్‌ను విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యత గల వ్యక్తిగా సామాజిక సేవలో దివ్యాంగుల సమాజం కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించి ప్రతి సంవత్సరం ఒకరిని సన్మానించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, జిల్లా నాయకులు పుర్ర బాల్‌రెడ్డి, రంగ్యానాయక్, శంకర్, రాజమౌళి, స్వామి, కొండల్‌రెడ్డి, పెంటయ్య, కుర్ల లింగం, హన్మంతు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ సెట్‌కు అర్హత సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని



నవతెలంగాణ-రెంజల్
మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని మేక శ్రీలేఖ (బోర్గం) టీఎస్‌సెట్ 2023లో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలరాం పేర్కొన్నారు. శ్రీలేఖ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతిలో 9.2, ఇంటర్మీడియట్లో 944 మార్కులు సాధించి పీజీ పూర్తి చేశారు. ఇటీవల జరిగిన టీఎస్ సెట్ 2023లో అర్హత సాధించినందుకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ ఇందిరాకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎం.పి.టి.సి లక్ష్మీ సంకరి లింగం, గాజుల అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య అవగాహన శిబిరం



మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సదాశివనగర్
సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ యందు మానసిక ఆరోగ్య అవగాహన శిబిరంలో భాగంగా కామారెడ్డి జిల్లా ఆసుపత్రి నుంచి డాక్టర్ రమణ ఎండి సైకియాట్రీ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు. మానసిక వైద్య నిపుణులు డా.జి.రమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. రోజువారీ దినచర్య, పరీక్షా ప్రణాళికనుగుణంగా చదువుకోవటంలో మార్పులు, పరీక్షా సమయంలో ఒత్తిడికి గురికావడం, పరీక్షల్లో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరు, ఒంటరితనం లేకుండా ఉండటానికి, భ్రమల్లో గడపకుండా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు ఊహించుకోవడం లాంటి విషయాలపై కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల హెల్త్ సూపర్‌వైజర్ డాక్టర్ హరిణి, వైస్ ప్రిన్సిపాల్ వి.రేణుక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సి.అనిత, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

కండక్టర్ల ఓవరాక్షన్..!

● తల్లి వెంట ఉన్న ఆడపిల్లలకు ఆధార్ కార్డు అడిగిన వైనం

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని కొందరు కండక్టర్లు ఓవరాక్షన్ చేస్తూ ప్రభుత్వ విలువలను దిగజారుస్తున్నారు. ఐదు సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలకు సైతం ఆధార్ కార్డు అడుగుతున్నారంటే ఆర్టీసీ కండక్టర్ ఓవరాక్షన్ ఎంత మాత్రం ఉందో ఇట్టే తెలిసిపోతుంది. తల్లితోపాటు బస్సులో ప్రయాణిస్తున్న ఆడపిల్లల ఆధార్ కార్డులు ఏవి అంటూ తమ ఇష్టం వచ్చినట్టు మాట్లాడాడని ఆ మహిళ ఆరోపించింది. గాంధారి నుండి కామారెడ్డి వెళ్తున్న బస్సులో మహిళ తన 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలు స్వతహాగా ప్రయాణం చేస్తారని, మహాలక్ష్మి పథకం లేనప్పుడే వారికి టికెట్ లేదు ఇప్పుడు ఏ విధంగా టికెట్ కొడతారని పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఈ చిన్న విషయం కూడా ఆ కండక్టర్‌కు అర్థం కాకపోవడంతో అతడు కండక్టర్‌గా ఎలా కొనసాగుతున్నాడో ఎవరికి అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

జన ఆరోగ్య సమితి సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం జన ఆరోగ్య సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నరసింహ స్వామి మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, పరిసరాల పరిశుభ్రత, దోమల వలన వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వ్యాధులు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మగవారికి కుటుంబ నియంత్రణ కార్యక్రమం ఈనెల 21న మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, ఏఎన్ఎంలు కృష్ణవేణి, స్వరూప, అంగన్వాడి టీచర్లు యమున, బాలమణి, మంజుల, దివ్య, ఉమ, గంగా జమున, ఆశా కార్యకర్తలు సంధ్య, హారిక, స్వరూప, సాగరిక, శోభ, నర్మద, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం నిర్మాణంతో తీరిన సమస్య



ఖాజపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో గ్రామస్తులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. సంవత్సరాల తరబడి అద్దె గదులలో, సంఘం భవనంలో, ఇరుకిరుకు గదులలో గ్రామపంచాయతీ పాలన కొనసాగడంతో సమావేశాలు జరగడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యకు పరిష్కారం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టడమేనని భావించిన సర్పంచ్ చింతం నాగయ్య అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కృషి చేశారు. దాంతో ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.20లక్షలను మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రామపంచాయతీ భవనం పూర్తవడం, అందులో నుంచి పరిపాలన సాగడం ప్రారంభమైంది. ఈ భవనంలో సమావేశం హాల్, సర్పంచ్ గది, పంచాయతీ కార్యదర్శి గది విశాలంగా నిర్మించడంతో గ్రామస్తుల ఇబ్బందులు తీరాయి. తమ గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని ప్రస్తుతం జిపి భవన నిర్మాణంతో తమ కల నెరవేరినట్లు అయిందని గ్రామస్తులు తెలిపారు.


సర్పంచ్ చింతం నాగయ్య

లక్షల నిధులతో అభివృద్ధి పనులు..

2019లో ఖాజాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన చింతం నాగయ్య గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. గ్రామంలో రూ.35 లక్షలతో సిసి రోడ్లు, రూ.25 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, మైనార్టీ శ్మశాన వాటికకు రూ.5లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు.

అలాగే అంబేద్కర్ భవనానికి రూ.5లక్షలు, మాదిగ దండోర సంఘం భవనానికి రూ.5లక్షలు మంజూరు అయినట్లు సర్పంచ్ తెలిపారు. రూ.12లక్షలతో వైకుంఠధామం, రూ.2.5లక్షలతో డంపింగ్ యార్డ్ నిర్మించామని, గ్రామ అభివృద్ధిలో భాగంగా రూ.12లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ కొనుగోలు చేసినట్లు సర్పంచ్ చింతం నాగయ్య తెలిపారు. అలాగే మిగిలిన సీసీ డ్రైనేజీల నిర్మాణానికి, 15 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నిధులు కావాలని అధికారులు గ్రామ అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

67వ ఉమ్మడి జిల్లాల నెట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి జిల్లా పరిషత్ పాఠశాలలో 67వ ఉమ్మడి జిల్లాల నెట్‌బాల్ పోటీలను మండలంలోని ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. అండర్-17 బాలబాలికలు ఉమ్మడి జిల్లాల నుంచి ఈ పోటీలలో పాల్గొన్నారు. (7) జట్లు బాలికలు (8) జట్లు బాలురు పాల్గొన్నారు. వీరిలో అత్యంత ప్రతిభను కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు ఇల్తేపు శంకర్, గణేష్‌రావు, పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శి సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, రాజేందర్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లాభాయ్ పటేల్ వర్ధంతి


సర్దార్ వల్లాభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-సిరికొండ

దేశసేవ, త్యాగనిరతికి చిహ్నంగా మహాసమైఖ్యత నిర్మాతగా ఉక్కుమనిషి సర్దార్ వల్లాబాయి పటేల్ సంకల్పబలం నేటి సమాజానికి ఆదర్శం కావాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. భారతదేశ తొలి ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లాబాయి పటేల్ 73వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో శు క్రవారం నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య సర్ధార్ వల్లాబాయి పటేల్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ బాల్యంనుండియే సామాజిక అంశాల పట్ల చొరవ చూపిన పటేల్ సమకాలీన అంశాల పట్ల తనదైన ముద్ర వేసుకొ ని స్వరాజ్య సంగ్రామంలో ప్రముఖపాత్ర పోషించిన అపర యోధుడన్నారు. దేశం మొత్తం స్వరాజ్య సిద్ధితో సంబరాలు చేసుకున్న తరుణంలో నిజాం గులాంగిరి, అరాచక పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని పోలీసు బలగాలతో బానిస సంకెళ్ళను చెరిపివేసిన వల్లాబాయి సంకల్పం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినదన్నారు. మహానీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని జాతి మనుగడకు సామాజిక వికాసానికి మనందరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ


క్షేత్రస్థాయిలో అవగాహన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని లింగంపల్లి, విట్టల్‌వాడి, విఠల్‌వాడి తాండా, పోచారం తాండా, తలబ్ తాండా, శివ్వాపూర్, సవార్గాం, లింగంపల్లిలో గ్రామ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు రైతు వేదికలో పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్దతులు, సాంకేతికతపై శిక్షణ కార్యక్రమం, క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ పులుగం రాజు మాట్లాడుతూ.. సమగ్ర వ్యవసాయ పద్ధతులపైన రైతులకు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన పద్ధతులు తగ్గించి పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని తెలియజేశారు. జీవ సంబంధిత ఎరువులైన పిఎస్బి, నానో యూరియా, నానో డిఏపి, వెస్ట్ డూ కంపోజర్ వంటివి వాడటం వలన వాతావరణ కాలుష్యం జరగకుండా, పంట అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయని ఇలాంటి అంశాల గురించి వివరించారు. రైతులు భూసార పరీక్షల ద్వారా అందించిన ఫలితాల ప్రకారం ఎరువులు వేసుకోవాలని తెలిపారు. అధికంగా ఎరువులు ఉపయోగించడం ద్వారా భూసారం దెబ్బతింటుందని, రైతు సేంద్రీయ ఎరువులు ఉపయోగించి భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులకు యాజమాన్య పద్ధతులపైన సలహాలు అందజేశారు. అలాగే ఏఈఓ మాధవి మాట్లాడుతూ.. రైతులు అధికంగా ఎరువులు వేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా వాతావరణం దెబ్బతింటుందని కావున రైతులు సిఫారసు మేరకు ఎరువులు వినియోగించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అలాగే ఉద్యనవన శాఖ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ.. ఉద్యనవన పంటలకు, కూరగాయల సాగుకు, పండ్ల తోటలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

చందా మియాబాగ్ ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చందామియా బాగ్ ఉప సర్పంచ్ చెక్‌పవర్ రద్దు అయినట్లు ఎంపీవో యూసుఫ్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని చందా మియా బాగ్ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ నిధులకు గత కొన్ని నెలల నుంచి చెక్కుపై ఉపసర్పంచ్ సంతకం చేయకపోవడంతో సర్పం చ్ కిషన్ నాయక్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా ఎంపీడీవో షోకాస్ నోటిస్ ఇచ్చిన స్పందించకపోవడం, సోకాజ్ నోటీస్కు వివరణ ఇవ్వకపోవడంతో కలెక్టర్ చెక్ పవర్ రద్దు చేస్తున్నట్టు సర్క్యులర్ జారీ చేశారు. చెక్ పవర్ సర్పంచ్, ఎంపీటీకు ఇచ్చినట్టు తెలిపారు.

పిల్లలకు ప్రత్యేకం 'శిశురక్ష'

● హైదరాబాద్ తరహా సేవలు జిల్లా కేంద్రంలోనే.. ● పేదలకు అందుబాటులో ఉండేలా ఫీజులు



శిశురక్ష ఆస్పత్రి భవనం


ఆస్పత్రిలో అధునాతన పరికరాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోనే ఏ ఆస్పత్రిలో లేనివిధంగా పుట్టిన పిల్లలకు ప్రత్యేక రక్షణాలయంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిశు రక్ష ఆసుపత్రి నిలుస్తోంది. హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు గ్రామస్థాయిలో వారికి అందుబాటులోకి తేవడానికి శిశురక్ష హాస్పిటల్‌ను కామారెడ్డిలో ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రి యాజమాన్యం ఫీజులను నిర్ణయించింది.

పిల్లలు పుట్టగానే ఏడవకపోవడం, నెలలు నిండకముందే పుట్టడం, తక్కువ బరువుతో పుట్టడం, ఉమ్మనీరు మింగడం తదితర వాటికోసం ప్రత్యేకంగా సిపాప్ అధునాతన పరికరాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ రుసుముతో చూసుకుంటే ఇక్కడ రుసుము సగానికి సగంగా ఉంటుంది. ప్రతి ఒక్క పేదవారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు.

800 గ్రాములతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక సదుపాయం..

కొంతమంది పిల్లలు పుట్టడమే 800 గ్రాములతో పుడతారని వారి గురించి ఎక్కువమంది అయోమయానికి గురై ఆందోళన చెందుతారు. అలాంటి ఆందోళన లేకుండా శిశు రక్ష ఆసుపత్రిలో 60 రోజులకు పైగా ఉంచుకొని వారికి ప్రతిరోజు 15 గ్రాములు పెరిగే విధంగా వైద్యం అందించనున్నట్టు ఆస్పత్రి యాజమాన్యం చెబుతోంది. తమ బ్రాంచ్‌లు కామారెడ్డితో పాటు బోధన్, సంగారెడ్డి, బీదర్‌లలో ఉన్నాయని తెలిపారు. మా ఆస్పత్రిలో పుట్టిన పిల్లలకు సైతం రక్తమార్పిడి చేయడం జరుగు తుందన్నారు. పుట్టగానే ఎవరికో ఒకరికి డెంగ్యూ వ్యాధి వస్తే వారికి సైతం వైద్యం తమ ఆసుపత్రిలో చేయనున్నట్టు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

బీసీల సంక్షేమానికి నిర్విరామ కృషి చేస్తా


నియామకపత్రం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లి ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షునిగా ఎర్రోళ్ల గంగామోహన్‌ను నియమించినట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ అధ్యక్షులు బట్టుస్వామి శుక్రవారం తెలిపారు. ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్ ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు గున్నల విక్రమ్ ఎన్ఆర్ఐ బాల్కొండ మండల అధ్యక్షుడు ఓరుగంటి మల్లన్న ఆధ్వర్యంలో నియామకం జరిగినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రోల్ల గంగామోహన్ మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్ఐ అధ్యక్షులు ఉపాధ్యక్షులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని బిసి ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వారికి అండగా ఉంటానని ఎల్లవేళలా బీసీ సంక్షేమ సంఘం కోసం పాటుపడతారని ఎర్రోల్ల గంగామోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బీసీ అధ్యక్షులు బట్టు స్వామి ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్ ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు గున్నల విక్రమ్ ఎన్ఆర్ఐ బాల్కొండ మండల అధ్యక్షుడు ఓరుగంటి మల్లన్న ఎన్ఆర్ఐ బీసీ సభ్యులు మున్నుస్వామి రాజశేఖర్ జనానయప్ తదితరులు పాల్గొన్నారు.

భవనాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని హైస్కూల్ నూతన భవనాల ప్రారంభో త్సవానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. గత సంవత్సరం నుంచి మండల కేంద్రంలోని హైస్కూల్ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పారిశ్రామికవేత్త పైపుల రాజిరెడ్డి ప్రజల విరాళాలతో, పూర్వపు విద్యార్థుల విరాళాలతో హై స్కూల్ భవనాల నిర్మాణాలను చేపట్టారు. 2024 జనవరి 4న భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు ఆహ్వానిస్తూ నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పూలబొకే అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పారిశ్రామికవేత్త పైపులు రాజిరెడ్డి, డిస్ కిషన్, రూపల గంగారెడ్డి, తలారి సతీష్, బుల్లెట్ అక్బర్ ఖాన్, ఆర్మూర్ గంగారెడ్డి, జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ అప్పల రాజన్న తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల సమావేశమందిరంలో సైబర్ సురక్షిత- జాతీయ భద్రతా అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. మితిమీరిన స్మార్ట్ ఫోన్ల వినియోగం అలవాటుగా మారి, వ్యస నంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఇది శరీర ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, మానసిక చికాకులు, మనోవ్యాదులు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ముకుంద పాషా మాట్లాడుతూ.. ఫోన్‌ను కేవలం మాట్లాడడం కోసం మెసేజ్ చేయడం కోసం ఇంటర్నెట్‌లో అవస రమైనది సర్చ్ చేయడం కోసం మాత్రమే వినియో గించాలని పేర్కొన్నారు. కానీ మధ్యలో సోషల్ మీడియా వచ్చి పూర్తి స్థాయిలో మనపై ఆధిపత్యం చెలాయిస్తుందని, రోజు సోషల్ మీడియా కోసం 5 నుంచి 8 గంటల సమయం కేటాయిస్తున్నారని ఇటీవలి సర్వేలు పేర్కొన్నా యన్నారు. అవసరం లేని యాప్‌లను అప్లోడ్ చేసుకొని సైబర్ మోసాలకు గురికావొద్దని సూచించారు. ఈ సైబర్ నేరగాళ్ళు ఫోన్ చేసి మీకు ఈ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే ఇంత అమౌంట్ మీకు అకౌంట్లోకి వస్తుందని నమ్మ బలికి ఓటిపి సెండ్ చేయాలని అడిగి 15 నిమిషాల తర్వాత మీ అకౌంట్‌లోకి 50వేలు లేదా లక్ష రూపా యలు వస్తుందని మోసం చేస్తారని హెచ్చ రించారు. సైబర్ నేరాల బారిన పడిన విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం జరుగు తుందని అలా చేసుకోకూడదని మనో ధైర్యం పెంచుకొని పోలీసు లను సంప్రదించాలని సూచిం చారు. మీకు సైబర్ నేరగాళ్లకు సంబంధించిన సమస్య వస్తే వెంటనే ఈ నెంబర్ కు 1930 కాల్ చేస్తే తమ సిబ్బంది అన్నివిధాలా సహాయపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ మహేష్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఆరతి, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, అధ్యాపకులు అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ సంపత్, అకాడమిక్ ఆడిట్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ గోరి, డాక్టర్ సంపత్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

● పిడిఎస్‌యూ కన్వీనర్ నరసింహ

నవతెలంగాణ-భీంగల్



మాట్లాడుతున్న నాయకులు

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విద్యాశాఖ మంత్రిని నియమించాలని పిడిఎస్‌యూ మండల కన్వీనర్ ఎం.నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. శు క్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయేది పరీక్షల కాలం, టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలతో పాటు ఎంసెట్, సీపీగెట్ తదితర ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. విద్యాశాఖ అనేది చాలాపెద్ద డిపార్ట్మెంట్‌అని రాష్ట్రంలో దాదాపు 41వేలకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, అందులో దాదాపు 59 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కాలేజీలలో లక్షలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కాబట్టి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. ఈ శాఖ ఇంకా సీఎం గారి వద్దనే ఉందని, ఒక పూర్తి స్థాయి మంత్రిని కేటాయించి, నిత్యం విద్యార్థుల సమస్యల పట్ల ఆరా తీయాలని అన్నారు.విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఫీజులను కొత్త ప్రభుత్వం కట్టడి చేయాలని అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అదే విధంగా చాలా పాఠశాలల్లో, కళాశాలల్లో టీచర్స్, లెక్చరర్ ల కొరత ఉందని, తద్వారా విద్యార్థులకు పాఠ్యంశాలు బోధించేందుకు చాలా ఇబ్బంది అవుతుందని అన్నారు. విద్యార్థుల చదువు ముందుకు సాగడం లేదు. రోజు రోజుకు విద్యా వ్యవస్థ భ్రష్టు పడుతుందని, సరైన విద్యాశాఖ మంత్రిని నియమించి రాష్టంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. సమావేశంలో అనిల్, భాను, మహేందర్, సాయి తేజ పాల్గొన్నారు.

హైస్కూల్లో సరస్వతీ విగ్రహం నిర్మాణానికి నాలుగు లక్షల విరాళం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రన్‌పల్లి గ్రామంలో ఉన్న స్కూల్ డెవలప్‌మెంట్‌కి గడ్డం సునీత రెడ్డి భర్త చంద్ర శేఖర్‌రెడ్డి ఆర్మూర్ మండలంలోని గగ్గుపల్లి గ్రామ నివాసి (పారిశ్రామికవేత్త శ్రీ పైపుల రాజా రెడ్డి చిన్న కూతురు) నాలుగు లక్షల రూపాయలు సరస్వతి విగ్రహం, గోపురంకోసం విరళంగా అందించారు. స్కూల్ డెవలప్మెంట్ కమిటీ తరుపున జక్రన్‌పల్లి గ్రామ ప్రజల తరుపున వారికి, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పైపుల రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, తలారి మరియా సతీష్, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విరాళం అందజేత